# వైకుంఠానికి నిచ్చెన

శ్రీ అనుముల వెంకటశేషకవి

## 1

"ఎవరు నేను?" - అని గట్టిగా అఱచినాడు ఆచారి ఆ ప్రశ్న గాలిలో యెగిరిపోయింది అతడు దిగ్భ్రాంతుడై చూచినాడు, ఏదో పెద్ద హాస్యానికి చేయిజేసుకున్నట్టుగా

"నాకు చెవుడుమాత్రం పట్టలేదు - సంతోషమే!" - అనుకోసాగినాడు మెదడే మీ పని చేయడంలేదు

చేత్తో ముఖాన్ని తడుముకుంటే, చిర కాలంనుంచీ క్షౌరంలేనట్టు గోచరించింది చిరిగిన పైజామా, మాసిన చొక్కా - అసహ్యంగా కనబడ్డాయి నూనెను మొహం వాచిన క్రాపు గాలికి కొట్టుకొచ్చి కండ్ల కడ్డం పడుతూంది

జేబులో చెయి దూర్చి, సిగరెట్టు తీసి అంటిస్తూ - పొగ ఆప్యాయంగా పీలుస్తూ కూర్చొని, అరగన్నులతో ఆలోచించి - "బహుశా, నే నీ చెట్టుమీదినుంచి పడి ఉంటాను, లేదా? క్రిందికి దూకి ఉంటాను" - అనుకున్నాడు

వంటనే కాళ్లు సర్దుకుంటూ లేచి, మళ్లీ ఒక బండమీద కూచున్నాడు ఆ మామిడి తోపులో దూరాన కోకిల కూసింది జడ పదార్థమైన బండకూడా జలదరించింది ఆ వసంతకాలవైభవం కనులపండువుగా గోచరించింది చిగుళ్ళూ, మొగ్గలూ, ననలూ, కొనలూ వేసిన వనతరువులన్నీ పులకరించినాయి వాటి రంగులు చూచి ఆచారి పరవశుడైనాడు అతని హృదయం ఆనందతాండవ మాడింది చూపులు తనివి మీఱి చుట్టూ ప్రసరించినాయి

వనానికి కంచెగా వేసి పెంచిన నాగజెముడు దగ్గర పాములు తిరిగినాయి కుందేళ్లు పరుగిడసాగినాయి ఉడుతలూ, నల్లి కీచులూ చెట్ల కెగ్రాకినాయి పైనుండి పక్షులు కలకలారావాలతో కంగారు పడినాయి ఆచారిభావాలు అద్భుతంగా మార్పు జెందినాయి

'ఆహా! ఈ వనమే నందనారామమై, ప్రాంతీయపట్టణం స్వర్గమైతే? - నేను దేవేంద్రుడను కాని, అప్సర లెవరూ లేరే?' - అతని మనసులో అనంగుడు నటించినాడు

'అదుగో! అప్సర! - అదృష్టమే యీ విధంగా అవతరించిందా? శతపత్రేక్షణ! చంచరీకచికుర! చంద్రాస్య! పక్వ బింబాధర! కలవాణి! అస్తినాస్తి విచికిత్సా హేతుశాతోదరి! నత - భ్రూ! కుంభి కుంభ - ని! ఇంకా యింకా? '

తారాశశాంకవిజయమూ, స్వారోచిష మనుచరిత్రమూ యిప్పుడు నిజం కాగూడదూ?—

అతడు దేహమే మఱచినాడు

*　*　*

'ఎవరు నేను?' - మళ్ళీ బిగ్గఱగా అఱచినాడు

మెల్లగా సమీపించి మిఱ్ఱిమిఱ్ఱి చూచింది అప్సర

'ఏంటి, పిచ్చిబాపనయ్యా! చెవిగోసిన మేకోలె అఱుస్తుండావు?'

ఆచారి అదరిపడినాడు అయ్యో, కర్మ! - అది ఆ ఊరి వకీలుగారింట్లో అంట్లు తోమే లచ్చిమిగాళ్లు! - వినాది పిల్ల! - మత్స్యగంధి మలినవసన! నీల మేఘశరీర! - అసహ్యపడుతూ, అట్టే తల వంచుకున్నాడు

'ఏమీ లేదు, నీ దారిని నీవు పో!' అని గర్జించినాడు అది వెళ్ళిపోయింది, తిరిగి తిరిగి చూస్తూ

ఊహాసౌధాలన్నీ కూలి, ఒక్కసారి ఆ భారమంత నెత్తిని పడినట్టు ఆచారి అంగలార్చినాడు అతని వనసులో కెగిన అనంగుడమాత్రం చిరస్థాయిగా నిలిచిపోయినాడు.

## 2

ఇంకొక సిగరెట్టు వెలిగించి, ధూపాన్ని విడస్తూ - 'ఈ జీవితంవల్ల లాభంలేదు, ఛీ! అంతా అంధకారబంధురం! తినడానికి మంచి తిండి లేదు, కట్టడానికనువైన బట్టలేదు, తుదకు క్షౌరానికైనా జేబులో దమ్మిడీ లేదు, చదువు సంధ్యల మీదా, ఆటపాటలమీదా బుద్ధి పోనంటుంది ఏం చేసేది? ఎక్కడైనా దూకి చస్తే బాగుంటుంది ఐతే, ఆత్మహత్య! - మహా పాపం కాదూ?" అనుకున్నాడు, ఆచారి

"ఎవరు నేను?" - ఈ ప్రశ్నకు సమాధానమే కుదరడంలేదు తలకాయకూ దీనికీ నడుమ యెన్నో అంతరాయాలు మామిడి తోపు మధురప్రకృతి మనసంతా చెదర గొట్టింది ఎవడైనా 'తాజమహాలు'లో కూర్చొని తాజావార్త లుపన్యసించవలసి వస్తే, సాగుతుందా? మనసు చలించకుండా నిలుస్తుందా?

అతడు తన స్థితిగతులను గురించి సింహావలోకనానికి ప్రయత్నిస్తున్నాడు ఒకప్పుడతని కుటుంబం ఉన్నతస్థితిలో ఉండేది తన సోదరికి నూతన సంస్కరణానుసారంగా వివాహం జరిగినందుకై, సంఘం బహిష్కరించింది ధన్యాత్ములైనందువల్ల త్వరలోనే తల్లిదండ్రులు-ఒకరు స్వర్గాన్నీ యింకొకరు వైకుంఠాన్నీ పంచుకున్నారు ఇక్కడ, యీ పార్థివ ప్రపంచంలో ఆ రెండు సుఖాలూ పోగొట్టుకొని, తాను మాత్రం అవస్థలు పడుతున్నాడు ఏదో కొద్దిగా మిగిలిన ఆస్తి, 'కాలేజి', చదువుకు వినియోగమైపోయింది ఇప్పుడో?

అనుకూలాలు లేనంతమాత్రాన, ఆశలు లేకపోతాయా? వారినీ వీరినీ ఆశ్రయించి రోజు లింతవఱకూ గడపినాడు దగ్గర బంధువులంతా మఱింత భీష్మించినారు, దూరపుబంధువులు దుమ్మెత్తి పోసినారు ఇంక సహాయపడేవా ళ్ళెవరు? స్నేహితులే!—

ఆ స్నేహితులు సహా అర్ధచంద్ర ప్రయోగాల కారంభించినారంటే - గతి?

ఆనాటి ప్రాతఃకాలాన అందఱూ చుట్టూ మూగినారు వీపున, 'విక్రయానికొక బుద్ధహీనుడు (*A fool for sale*),' అని వ్రాసిన చీటీ అంటించినారు ఒకడు చదివి చప్పట్లుకొట్టినాడు తక్కినవాళ్లంతా గొల్లున నవ్వినారు ఏమీ తోచక, యెట్లనో తప్పించుకొని, యీ మామిడి తోపు ప్రవేశించినాడు ఇక్కడ చెట్టెక్కి పడుకుంటే, యెప్పుడు పడినాడో క్రింద - ఇదీ అతని కథ

ఆచారి కోపమంతా దబ్బున సమాజం మీదికి వ్యాపించింది 'ఇదేనా ధర్మం?

ఇదేనా సంఘం? మనుష్యులను వేలు పఱచి, మాటిమాటికీ హింసించి, మరణించిందాకా పరిహసించడమా? కసి తీర్చుకోడాని కేమీ మార్గం కానరాదూ?'

## 3

ఆ ఊళ్ళో మాయనై ఆచారి 'కలకత్తా' లో తేలినాడు. 'భోగికి రోగభయం, ధనికునకు చోరభయం, వీరునకు మరణభయం, విద్యావంతునకు దారిద్ర్యభయం, విరాగి కేమో యే భయమూ లేదు' - అన్న భర్తృహరి శ్లోకార్థం అతనికి పూర్తిగా నచ్చింది. అందుచేత సన్యాసం స్వీకరించినాడు. ఆ దెబ్బతో అతని తారాబలంకూడా మారింది. జన్మే మారితే, తక్కినవి మారక ఊరుకుంటాయా?

వంగదేశంలో వైష్ణవసన్యాసమంత సొగసైన ఆశ్రమ మింకోటి లేదు. మన సన్యాసులకువలె దేహదండన, ఆత్మదండనాది నిర్బంధాలు బొత్తిగా అక్కరలేదు. ఇష్టదైవం శ్రీకృష్ణపరమాత్మ కనుక, యిష్టానుసారం ప్రవర్తించవచ్చు. రాసలీలలూ, జలక్రీడలూ - అన్నిటికీ అందులో అవకాశా లెక్కువ. ఒక్క ప్రపత్తి మాత్రముంటే, అపరాధాలన్నీ మాఫీ. ప్రపత్తి అంటే పరిపూర్ణ శరణాగతత్వం. ప్రేమమయుడూ, కరుణాస్వరూపుడూ ఐన కృష్ణభగవానున కేపాటి పనైనా కల్పించకుంటే ప్రయోజనం?

అన్నిటితోగూడా ఆచారి పేరూ మారింది. అతడిప్పుడు 'మాధవానంద బాబాజీ,' - 'గోపాలరామగోస్వామి' శిష్యుడు. గోపాలుడు బాల్యయౌవన కౌమారాది దశలన్నీ గోపాలుడుగానే గడపి, వృద్ధాప్యంలో విధిలేక సన్యసించిన మహానుభావుడు. మొదటి ముగ్గురు భార్యలూ సంసారంచేసి చస్తే, నాలుగో భార్య సంసారమే చేయక అతనిని చంపసాగింది. ఆవిడమీద హఠాత్తుగా కలిగిన కోపంవల్ల అతడు జన్మ మార్చుకొని సన్యాసం పుచ్చుకున్నాడు. అంతటి స్వార్థత్యాగి, అఖండయోగి లభించినందున సన్యాసాశ్రమమే పవిత్రమైపోయిందని అందరూ పొగడినారు.

గోస్వామి తన శిష్యుడైన బాబాజీకీ విధంగా బ్రహ్మోపదేశం చేసినాడు: 'నాయనా! ఇహలోక సుఖాలన్నీ యెండమావులవంటివి. ఇంకో రహస్యం విన్నావా? ఈ లోకంలో మనం దేన్ని కోరుతామో, అది దూరమైపోవడమే తప్ప దగ్గరకు రాదు. దృష్టాంతంగా ధనాన్ని తీసుకో! దాతలను కాలితో తన్ని, పరమలోభులనే పరిరంభిస్తుంది. అంతవఱ కెందుకూ? అసలు మానవుని నీడనే చూడు! వెన్నాడితే పరుగెత్తి దూర దూరం పోతుంది. వద్దనుకొని తిరిగితే కుక్కవలె వెంబడిస్తుంది. లక్ష్మికూడా అటువంటిదే. కాబట్టి నిజమైన సుఖప్రాప్తి కావలెనంటే, యింద్రియ నిగ్రహం - కాదా, విముఖత అగత్యం. వైరాగ్యం పుచ్చుకొనిమాత్రం సుఖపడగూడదూ? అదంతా అనుభవైకవేద్యం. అన్ని రహస్యాలూ నిదానంగా అర్థమౌతా యిలే!'—

ఆ మాటలు గట్టిగా పట్టుకున్నాడు బాబాజీ. ఒకవేళ హృదయపూర్వకంగానే ఉపదేశించినా ఉపదేశించి ఉండవచ్చు, గోస్వామి అతని పాలిటికి నాలుగో భార్య యెండమావిగానే పరిణమించి, యీ మాటలు పలికించడాని కుపకరించింది కూడాను. పండుముసలితనంలో గురువు పలికిన పలుకులు, శిష్యుడికి నడివయసులోనే నమ్మకాన్ని హెచ్చించినాయి. ఎక్కడలేని వ్యామోహంతో గురుకటాక్షనికి పాత్రుడైనాడు బాబాజీ.

అనుభవంలో గూడా ఆ ఉపదేశం యథార్థంగా పరిణమించింది. వరిస్తే పరుగెత్తే లక్ష్మీదేవి, తిరస్కరించి తిరిగే బాబాజీని వెంబడించసాగింది. అంత స్వల్పకాలంలోనే అంత సులభంగా లక్ష్మి లభిస్తుందని కలలోనైనా తలంచినవాడుకాడు, మాధవానందుడు. అన్నీ వదలి తన్ను నమ్ముతుంటే అఖిలమూ యిచ్చి అనుసరిస్తానన్న శ్రీ కృష్ణపరమాత్మ దివ్యవాణి యెన్నటికైనా అబద్ధమౌతుందా?

## 4

తెల్లని నిలువంగీ తొడిగినాడు, మోకాళ్ళకు కొంచెం క్రిందివఱకూ ఒక మల్లు పంచె చుట్టినాడు, గోపీచందనంతో వివిధ ముద్రలు శరీరమంతా ముద్రించినాడు, చిఱుతపులిచర్మం మోస్తరు ఉత్తరీయాన్ని ధరించినాడు, తులసీవనమాలా శంఖమూ రెండు చేతుల్లో పట్టుకున్నాడు, బాగా పెరిగినజుట్టు మెలికలు త్రిప్పి నడినెత్తిని కిరీటంగా కట్టుకున్నాడు. జాగంట కొడుతూ, శంఖమూదుతూ, హరినామస్మరణచేయడాని కారంభిస్తే, బాబాజీ జోలెలో బోలెడు ధాన్యం పడుతుంది.

వదలుకోవలసిన కామినీ కాంచనాలలో, రెండోది సులభంగా లభించింది. మొదటిదానికి మాత్రం అభ్యంతరం కలుగవలసిన అవసరం లేదనుకున్నాడు మాధవుడు. అందుకోసం సవారీ లేచినాడు. పుణ్యక్షేత్రాలన్నీ గాలించి పూర్తిగా అనుభవించదలచుకున్నాడు. అక్కడిపుణ్యాన్ని అవకాశమున్నంతవఱకూ, వీలు చిక్కినంతవఱకూ, వైరాగ్యమహిమను చవి గొంటున్నాడు. గురూపదేశాన్ని సార్థకంగా మననం చేస్తున్నాడు కూడాను.

దారిలో ఒక వైష్ణవ అగ్రహారం. అక్కడి దేవస్థానంలో 'మేళం' జరుగుతుందని తెలిసింది. మేళమంటే వైష్ణవ సాంప్రదాయార్థం వేఱు. వారిలో బైరాగులేకాక, బైరాగిణులు కూడా ఉంటారు. 'నేను-నాది' అనే మమకారాన్ని వదలి, మంచి చెడ్డలూ, వెనుక ముందులూ, వావి వరుసలూ - అనే ద్వంద్వ భావాలను పరిత్యజించిన బైరాగులకూ, బైరాగిణులకూ విరివిగా జోడు కుదురుతుంది. ఐతే, సామాన్య సంసారులకు జరిగే వివాహానికీ దినికీ సంబంధం కల్పించడం సాంప్రదాయ విరుద్ధం. విదేశీయ 'కాంట్రాక్టు' పరిణయాలతోనైనా పోల్చడానికి భయమనిపిస్తుంది.

'మధుర భావసాధన' కోసం వచ్చే బైరాగిణులంతా రాత్రిపూట, పూర్తిగా బురఖాలు ధరించి, దేవాలయంలో ప్రవేశిస్తారు. దీపాల క్రీనీడల్లో వరుసలు తీరి, చేతివ్రేళ్ళను మాత్రమే బయటికి చూపుతూ, కూర్చుంటారు. వైష్ణవ బైరాగులు కండ్లకు గంతలు కట్టుకొని యింకొక వరుస తీరు

(36-వ పేజీ చూడండి)

బహుమతి రు. 500
(గవర్నమెంటు రిజిష్టర్డు)
తెల్ల వెండ్రుకలను పోగొట్టును
రంగులనుచూచి మోసపోవద్దు అది తాత్కాలికము మా సువాసనగల మన్‌మోహిని హేర్ ఆయిల్" అనేక వనమూలికలతో ఆయుర్వేద పద్ధతిలో తయారై 60 సం॥ వయస్సువరకు వెండ్రుకలను నల్లగాపుంచును ఇదిగాక మెదడుకు చలవనిచ్చును ఉన్మాదము తలనొప్పి" వగైరా జబ్బులరానీయదు జ్ఞాపకశక్తిని కంటి చూపును వృద్ధిచేయును కొద్దిగా నెరిసివుంటే ఒక సీసా రూ 2 8-0 3 సీసాలు రూ 6 8 0 సగము నెరిసివుంటే ఒకసీసా రూ 3 8-0 3 సీసాలు రూ 9/- పూర్తిగ నెరసివుంటే ఒక సీసా రూ 5/- 3 సీసాల రూ 12/- ఇది పని చేయదని నిరూపించిన రూ 500/-
INDRA LABORATORIES
No 795/3 P O Begusarai (Monghyr)

# వైకుంఠానికి నిచ్చెన

(13-వ పేజీ తరువాయి)

స్తారు ఒక్కొక్కడు ముఖం తడుముకుంటూ ముందుకునడచి, ఒక్కొక వైష్ణవిని సమీపించి, వెలుపలికి ఉంచిన చేతివ్రేళ్లను స్పృశించి, గట్టిగా పట్టుకుంటాడు వెంటనే వయో తారతమ్యాలుగానీ, దైహిక రోగారోగ్య పరిస్థితులుగానీ, రూప కురూప లక్షణాలుగానీ విమర్శించకుండా అనుసరించిపోయి, ఒక సంవత్సరకాలం 'మధురభావసాధన' చేయవలసిందే ఆటుతర్వాత, 'యెవరికి వారే యమునాతీరే,' అవుతుంది ఇద్దరూ మళ్లీ అవసరమైతే, యింకో స్వయంవరానికి హాజరుకావచ్చు

ఆ సాధకులకు సంతాన నిరోధ విద్యావిషయికవిజ్ఞానమంతా కరతలామలకమే కాబట్టి, ముక్తాత్మలకు పునర్జన్మలు లేకుండా రక్షిస్తారు వృధా పుట్టుచావులకు గురిచేసి, పీడించి పిప్పిచేసే పాపానికి వారెన్నడూ పూనుకోరు

మన మాధవానందబాబాజీ సహా, రాత్రి మేళానికి హాజరైనాడు గంత కట్టుకోడానికి ముందే ముసుగులు పరీక్షించినాడు కాని, తారతమ్యజ్ఞానం పనిచేయడానికేమీ మార్గం లేకపోయింది అన్ని బురఖాల్లో, యేబురఖా మంచిదో అని అందాజా చూచినాడు హృదయకావ్యానికి ముఖమే విషయసూచికైతే, అబలాసౌందర్య గ్రంథానికి ముసుగెందుకు కాగూడదూ? బహిస్సౌందర్యమంతరంగసౌందర్యానికి సాక్షిగా తీసుకున్నాడు బాబాజీ మధురభావ సాధనలో యిటువంటి విచక్షణ పనికిరాదనే జ్ఞానం, ఆ సమయంలో అతనికి స్ఫురించలేదు ఒకతె బురఖా పసందుగా తోచింది, మనసుకు బాగా నచ్చింది ఇంకేం? ఆమె యెదుటనే స్థానం కల్పించుకొని, కండ్లకు గంత కట్టుకున్నాడు

ప్రక్కనున్న ముదిబైరాగి వంతు రాగానే, బాబాజీహృదయం తహతహలాడింది, తాను కన్నువేసిన బురఖా వాడి పాలౌతుందేమో? - అని తాళుకోలేక, తన కండ్లగంతను దొంగతనంగా తొలగించి చూచినాడు ఆ ముదిబైరాగి అవస్థపడుతూ వెళ్లి వంతు తీర్చుకున్న తరవాత గాని, బాబాజీప్రాణాలు కుదుటబడ్డవి కావు తను వరించినదాన్ని వాడు తాకలేదు!-

మన బైరాగి వంతుకూడా వచ్చింది ఒక ప్రక్కకు తొలగిన గంతనుండి ఒక కన్ను కనబడుతున్నా, పుట్టు గ్రుడ్డివలె నటిస్తూ వెళ్ళి, ప్రీతిపూర్వకంగా వరణీయ వైష్ణవీహస్తాన్ని పట్టుకున్నాడు ఆమె బురఖాతోనే అతడిని అనుసరించింది

## 5

పాలిటబడిందే పంచామృతంగా భావించి వచ్చిన బైరాగిణిని వెంటబెట్టుకొని, బాబాజీ ఒక పాడుమఠంలో దూరినాడు అంతకు ముందే జాగ్రత్తపరచి ఉంచుకొన్న మైనపువత్తిని, అగ్గిపుల్ల గీచి వెలిగించినాడు ఒక చెక్కమంచాన్ని సంపాయించి, అక్కడ వేసినాడు ఉత్తరీయం పరచి, ఆమెను కూర్చోబెట్టినాడు ఆ వ్యక్తిమాత్రం బురఖా తొలగించలేదు

ఇంకా ముసుగెందుకూ? ఇక్కడ పరాయిజనం యెవ్వరూ లేరు నీవూ నేనే సుమా! నీముఖసందర్శనం చేయించి నా అగ్ని నార్పవూ?'-అని బాబాజీ ఆత్రంగా అన్నాడు

ఏమీ జవాబు రాకపోయింది బురఖా అట్లనే ఉండిపోయింది మాధవానందుడు మళ్లీ యీ విధంగా ప్రారంభించినాడు

'క్రొత్తగనుక సిగ్గుపడుతున్నావా? మధురభావసాధనకు అటువంటిదే చాపనికిరాదు మన మిద్దఱం పరస్పరం ఆప్తులమైనాము ఒకే మార్గాన్ని అనుసరించే మనకు సత్వరంగా ప్రయాణం సాగి గమ్యస్థానం చేరువౌతుంది మౌనం వదలి మాట్లాడితే నోట ముత్యాలు రాలుతాయేమో? ఏదీ?- కొంచెం - ఊఁ!'.

అప్పటికీ ఆ మూర్తి చలించలేదు ఆ యువక బైరాగి తహతహలాడినాడు

'అయ్యో! ఎందుకంత అధైర్యపడుతావు? నీవుగూడా సాంఘిక - అత్యాచారాలను అసహ్యించుకొని, సమాజం మీద కసితీర్చుకోడానికే యీ ఆశ్రమాన్ని స్వీకరించినావా? నావలెనే సాహసాన్ని అవలంబిస్తే, దారిద్ర్యం నశిస్తుంది ధైర్యం హెచ్చుతుంది మాతృ పితృ ప్రేమలకు నోచుకోని మనమిద్దరం కలిసి, పరస్పర ప్రణయడోలికల్లో వూగుదాము లోకాన్ని చూచి నవ్వుదాము మధురభావసాధనలో ఉత్తీర్ణులమౌదాము "

ఆమె కదలలేదు - మెదలలేదు అతడుద్రేకమాపుకోలేక ఆ ముసుగు స్వయంగా తొలగద్రోసినాడు పాపం! అతని ఉత్సాహమంత ధ్వంసమయింది ఆనాటి స్వదేశంలోని యే నాదిపిల్ల యెంతో మేలు! - ఆ స్వయంవర వైష్ణవిని చూడలేక అతడు కండ్లు మూసుకున్నాడు! - ముదివగ్గు! - రతీమన్మథులు పరిత్యజించిన పాడుకొంప!—

తరుణవయస్కుడైన మన బాబాజీ అదృష్టంపుచ్చి, అట్టిది దొరకింది ఐతే, ఆమె అభిప్రాయం వేఱు

“ఇంక బ్రదికినన్నాళ్లు బ్రదుకను ఈ స్వల్పకాలమైనా యింత పుణ్యంచేసుకొని, పరంధామపదవికి పోదాము'' అనుకుంది

మధురభావసాధనకు బదులు మర్యాదతక్కువైన పోట్లాట జరిగింది మఱునాడు తెల్లవాఱకముందే బాబాజీ మాయమైనాడు

* * * *

మళ్లీ కలకత్తా చేరగానే, గురు దివంగత వార్త విని, బాబాజీ పరితపించినాడు ఆ పరితాపం అట్టే హెచ్చకముందే హక్కులన్నీ అతని స్వాధీనమైనాయి ఊళ్లో ప్రసిద్ధుడూ, బలిష్ఠుడూ, శ్రీమంతుడూ, విద్యావంతుడూ అనిపించుకొన్న గోపాలరామగోస్వామిమఠానికి ఆధిపత్యం దొరికినందున, మాధవానంద బాబాజీ గురుస్థానాన్ని అలంకరించినాడు

ఆ సమయానికి సరిగా గోస్వామి నాల్గవ భార్య - బాలవితంతువు - ఆ మఠంలో ప్రవేశించి, హక్కులకోసం ప్రయత్నించింది గురుస్థానంలోఉన్న బాబాజీ మొదట గుర్రుమన్నాడు కాని, క్రమంగా రాజీపడక తప్పిందికాదు ఉట్ట ఉడియంగా లభించిన బలిష్ఠస్థానమూ, శ్రీమంతస్థానమూ విద్యాస్థానమూ, గురుస్థానమూ, దక్కించుకోడానికి ఐదో స్థానాన్ని గూడా ఆక్రమించడం మంచిదనే ఉపకారబుద్ధి అతనిలో ఉత్పన్నమయింది

పతివియోగపరితాప శమనార్థమూ, ఆత్మసంతోషార్థమూ మఠంలో ప్రవేశిం

## రు 100 బహుమానం

(గవర్నమెంటు రిజిష్టర్డు)

తెల్ల వెంట్రుకలను అంత మొందించండి రంగులు వాడకండి మా ఆయుర్వేద సువాసన “ సెంట్రల్ మోహిని ఆయిల్ ” 60 ఏళ్లు దాకా నల్లగా ఉంచును ఇది మీదృష్టిని వృద్ధిపరచి తల నొప్పిని కుదుర్చుతుంది కొన్ని వెంట్రుకలు తెల్లబడితే రూ 2-8-0తో ఒక సీసా (మూడు ఒకసారి 6-8-0) కొనండి హెచ్చుగ తెల్లబడితే 3-8-0 (మూడు ఒకసారి 9-0-0 ) తలంతా తెల్లబడితే రు 5 0 0 (మూడు ఒకసారి రు 12) కొనండి ఇది అబద్దమని ఋజువుచేసిన వారికి రు 100 బహుమానం పూర్ణ విశ్వాసానికి అణాస్టాంపు పంపి గ్యారంటీ తీసుకొనండి

**Bharat Kalyan Aushadhalaya**

Post Bag No 6725, Calcutta (A P)

-చిన గురుపత్ని సైతం, హక్కులకోస మెంతటి త్యాగమైనా చేయడానికి సిద్ధపడింది ఆమె కింక యిల్లక్కరలేదు, వాకిలక్కరలేదు; బంధువులక్కరలేదు, పరులక్కరలేదు విష్ణుప్రీతీ విష్ణుప్రసాదమూ దొరకితే చాలు అందుకై పదే పదే వచ్చి, మఠంలో ప్రతిష్ఠింపబడి ఉన్న రాధాకృష్ణులను పూజిస్తుంది కన్నీరు కార్చి, తన దురవస్థ చెప్పుకుంటుంది ఆమె భక్తి నగాధంగా పొగడుతూ, అందరికంటే హెచ్చు ప్రసాదాన్ని అర్పిస్తూ, అతడు తరణోపాయాన్ని పలుమా రుపన్యసించినాడు ఇంగితజ్ఞురాలైన గురుపత్ని అందు కంగీకరించింది

సదా శ్రీరాధాకృష్ణ సన్నిధానమందే నివసింపగలచిన గురుపత్నికి 'రాధాదాసి' అని అతడు నామకరణం చేసినాడు అప్పటినుంచీ రాధాదాసి భక్తినిగూర్చి చిత్ర విచిత్రమైన కథలు బయలుదేరినాయి ఆమెకు దేవుడు ప్రత్యక్షమన్నారు, ఆమె చేతులారా తినిపిస్తే నైవేద్యం తింటూ డన్నారు, ఆమె భ్రూమధ్యంలో జ్యోతి వెలుగు నన్నారు; ఇంకా కొందరామెను కృష్ణుడు రాధగా స్వీకరించదలచినట్టు కూడా ప్రవాద పుట్టించినారు

తక్కిన బాలవితంతువులు, 'రాధాదాసి ఎక్కువేం? మేము తక్కువేం? ఆమెకంటే ఎన్ని సంవత్సరాలముందరనో మేము భర్తలను పోగొట్టుకొన్నాము అందుకోసమైనా ఆ రాధాపదవి మాకు రావలసింది,' అంటూ అర్జీలు పెట్టుకున్నారు

'రాధాదాసి' నామకరణానంతరం, మాధవానంద బాబాజీ తన పేరు కూడా మార్చుకున్నాడు మాధవుడంటే నేమి? కృష్ణుడంటే నేమి? కాబట్టి 'కృష్ణదాసు' అని పేరు పెట్టుకున్నాడు పర్యాయార్థ దృష్టితో పేరు మార్చుకొన్న బాబాజీకి గణిత దృష్టికూడా కలిగింది రెండక్షరాల పేర్లుగల రాధాకృష్ణులు పరస్పర ప్రియులైతే, నాలుగక్షరాల పేర్లుగల రాధాదాసి - కృష్ణదాసు లెందుక్కా కూడదూ?

ఒకరాత్రి కృష్ణదాసు, రాధాదాసికి 'మధుర భావసాధన'నుగూర్చి విశదపరచినాడు 'పురుషులంత కృష్ణులు, స్త్రీలంతా రాధలు, అనే తత్వం బోధించి, వైష్ణవుల గుప్తసాధనలన్నీ వర్ణించినాడు వింటూన్న రాధాదాసికి రోమాంచమయింది 'అయ్యో! అంత యోగ్యతకు నే నర్హురాలనా? ఎంత పుణ్యం జేసి పుట్టిందే - అది లభిస్తుందా?' అని అంగలార్చింది

కృష్ణదాసుబాబాజీ ఆమె దుఃఖం చూడలేకపోయినాడు 'రాధాదాసీ! నీవు విచారింపవలసిన పనిలేదు నీ యాత్మనూ, శరీరాన్నీ నా కొప్పగించి శరణాగతురాలవు కా! నేను నిన్ను వైకుంఠాని కెత్తుతాను నీకు ముఖ్యంగా ఉండవలసింది ప్రపత్తి - అంటే, భక్తి - అంటే నేను చెప్పినట్టు వినడమేసుమా!'-అంటూ రాధాకృష్ణవిగ్రహాలకు నమస్కరించిన తరువాత, 'వింటావా?' అని అడిగినాడు

'నేను వినకేమి? మీకే నామీద అనుగ్రహం రాకగాని - దయచేసి, తరించే మార్గం చూపండి!' అని జవా బిచ్చింది రాధాదాసి

'ఐతే, యిప్పుడే ప్రారంభిస్తాను ఆధ్యాత్మిక విచారంలో ఆలస్యం బొత్తిగా పనికిరాదు'-అని చెప్పి, అక్కడి విగ్రహాలను ఉయ్యాలమీదినుంచీ క్రిందికి దించినాడు ఆశ్చర్యకుతూహలాది భావకోలాహలంలో మునిగి తేలే రాధాదాసి చూస్తుండగానే, ఉయ్యాలమీద తాను ఆసీనుడైనాడు అతనిలో ఉండిన దాసత్వం పూర్తిగా నిష్క్రమించి, కృష్ణత్వం సంపూర్ణంగా ఆవహించింది

'ఎవరు నేను? రాధా! చెప్పుకో!' - అని శృంగారదృష్టితో అవలోకించినాడు.

రాధాదాసికి సహా దాసిత్వ మంతరించినట్టయింది ఆమె సిగ్గుతో శిరసు వంచి, ఒయ్యారంగా - "మీరు శ్రీకృష్ణభగవానులే! - కాని, నే నెవతెను?" - అని మారుపలికింది

"భేష్! నీ భక్తికి మెచ్చి నే నిక్కడకు వచ్చినాను నీవు రాధవు కదూ? ఏదీ? నాదగ్గరకు రా! - అని బాబాజీ బారసాచి ఆహ్వానించినాడు

కుతూహల మెక్కువైనందున, గునగున నడచి, ఆమె అతని చేతులలో ఆ పిమ్మట ప్రజ్ఞే లేకపోయింది ఏదో ఒక విధమైన అవ్యక్తమాధుర్యం! అపరిమిత సౌఖ్యం! -

'ఎవరు నే?' - నంటే, 'ఎవతెను నే?' ననుకుంటూ, యిద్దరూ ఆనందసాగరంలో తేలి, వైకుంఠానికి నిచ్చెన వేసినారు ★

